ప్రజాశక్తి
సోమవారం 15, మే 2023
5
అనంతపురం



## మహా కవిసమ్మేళనానికి కవితలు ఆహ్వానం

**ప్రజాశక్తి-అనంతపురం**

రాయలసీమ సాంస్కృతిక ఉద్యమంలో భాగంగా రాయలసీమ సాంస్కృతిక వేదిక, వేమన అధ్యయన అభివృద్ధి కేంద్రం నిర్వహిస్తున్న 7వ రాయలసీమ మహా కవి సమ్మేళనానికి కవితలను ఆహ్వానిస్తున్నట్లు సమన్వయకర్త, కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత అప్పిరెడ్డి హరినాథరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. అంతర్జాల వేదికన మే 28న కవిసమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. 'రాయలసీమ కీలక సమస్యలు-భవితవ్యం' ఇతివృత్తంగా కవితలు రాసి మే 25వతేదీలోపు సెల్..99625 44299 నెంబర్‌కు వాట్సప్ పంపాలని కోరారు. కవులకు ప్రశంసాపత్రాలతో పాటు, కవితలను సంకలనంగా ప్రచురించనున్నట్లు తెలిపారు.

# విన్నారు... ఏం చేస్తారో చెప్పలేదు...



స్థానిక నాయకులతో కలసి వస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

## పార్టీ కోసం కలిసి పనిచేయాలని హితవు
## ముగిసిన వైసిపి నియోజకవర్గాల సమీక్ష

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

ఎన్నికలు సమీస్తున్న తరుణంలో పార్టీలో నెలకొన్న అసంతృప్తులు, అసమ్మతులను చల్చార్చడంలో భాగంగా మూడు రోజులుగా ఆ పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ అయిన విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమీక్షలు ఆదివారం ముగిశాయి. నారాయణపురం పంచాయతీ పరిధిలోని ఒక ప్రయివేటు రిసార్ట్సులో అనంతపురం జిల్లా పరిధిలోని ఎనిమిది నియోజకవర్గాల ఎమ్మెల్యేలతోపాటు, ముఖ్య నేతలతోనూ విడివిడిగా మాట్లాడారు. ముందుగా అసమ్మతి నేతలుగా గుర్తించిన వారిని ప్రత్యేకంగా నియోజకవర్గ కో ఆర్డినేటర్ల ద్వారా సమాచారం అందించి పిలిపించారు. అందరితోనూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విడివిడిగా మాట్లాడారు. నియోజకవర్గంలోని సమస్యలతోపాటు, అసమ్మతికిగల కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఈ సమీక్షల్లో గుంతకల్లు మినహా తక్కిన అన్ని చోట్ల పెద్దఎత్తునే అసంతృప్తులు, అసమ్మతులను నేతలు వినిపించారు. ఎనిమిది నియోజకవర్గాల్లో ఏడు నియోజకవర్గాల్లో వైసిపి ఎమ్మెల్యేలున్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో టిడిపి ఎమ్మెల్యే ఉన్నారు. ఇక్కడ పార్టీ ఇన్‌ఛార్జిఉన్నారు. వీటిల్లో చూసినప్పుడు రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో తీవ్ర స్థాయిలో అసమ్మతి వెల్లడైందనే చెప్పాలి. ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డిపై పెద్దఎత్తునే నియోజకవర్గంలోని నాయకులు తమ అసమ్మతిని వ్యక్తం చేసినట్టు సమాచారం. ఇక కళ్యాణదుర్గం అయితే మంత్రి ఉషశ్రీచరణ్‌ని వ్యతిరేకించే గ్రూపు సమావేశానికి రావడం లేదని తేల్చి చెప్పారు. గతంలోనే ఇక్కడి పరిస్థితులను తెలియజేసినా ఎటువంటి చర్యల్లేనందున ఇక వచ్చి ప్రత్యేకంగా చెప్పదేమి లేదని సమీక్షకే దూరంగా ఉన్నారు. ఉరవకొండ నియోజకవర్గం సంబంధించి మూడు గ్రూపులుగా నాయకులు వచ్చి ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకున్నారు. అనంతపురం నియోజకవర్గంలోనూ, తాడిపత్రి, శింగనమలలోనూ ఇదే తీరున నాయకులు ఎమ్మెల్యేలపై అసమ్మతిని, వారి పనితీరుపై ప్రజల్లోనున్న అభిప్రాయాలను మంత్రి ఎదుట కుండబద్దలు కొట్టినట్టు చెప్పినట్టు తెలుస్తోంది. అయితే అన్నింటినీ విన్న మంత్రి సమన్వయం చేసుకుని పార్టీ కోసం పనిచేయాలని హితవు చెప్పినట్టు సమాచారం. అయితే తాము చెప్పిన సమస్యలను విన్న పార్టీ పరిశీలకులు ఏమి చర్యలు తీసుకుంటారన్న ప్రశ్న లేవనెత్తుతుండటం గమనార్హం. వినడం వరకే పరిమితమవుతారా లేక నష్ట నివారణకు ఏమైనా చర్యలు తీసుకుంటారా అన్నది ఇప్పుడు ఆ పార్టీలోని అసమ్మతి నేతల మదిలో మెదులుతున్న ప్రశ్న. ఒకరిద్దరు నాయకులు అసమ్మతిని వ్యక్తం చేసిన తరువాత నేరుగానే కో ఆర్డినేటరును ప్రశ్నించినట్టు తెలుస్తోంది. తాము చెప్పిన విషయాలన్నీ తిరిగి ఆయనకు చెబుతారా అన్న సందేహాన్ని కూడా వ్యక్తం చేసినట్టు సమాచారం. పార్టీలో ఎమ్మెల్యేల పట్ల ఆ పార్టీ నేతలోనున్న తీవ్రమైన అసంతృప్తి వెల్లడైంది. అయితే దాని నష్ట నివారణకు ఎటువంటి చర్యలుంటాయన్న చర్చ ఇప్పుడు నేతల్లోనూ, కార్యకర్తల్లోనూ సాగుతోంది. అందరినీ సమన్వయం చేసుకుని ముందుకెళ్లే విధంగా వారిలో మార్పులు తీసుకొచ్చే విధంగా పార్టీ అధిష్టానం చర్యలు తీసుకుంటే వచ్చే సార్వత్రిక ఎన్నికలకు పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయడానికి వీలవుతుందన్న అభిప్రాయం ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకుల నుంచి వ్యక్తమవుతోంది.



సమావేశంలో మాట్లాడుతున్న కల్టెర్ గౌతమి

## ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి
### కలెక్టర్ ఎమ్.గౌతమి

**ప్రజాశక్తి అనంతపురం కలెక్టరేట్**

అనంతపురము నగర పరిధిలోని జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని వార్డు అమెనిటీస్ సెక్రెటరీలను జిల్లా కలెక్టర్ ఎం. గౌతమి ఆదేశించారు. ఆదివారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో సమావేశ మందిరంలో వార్డు అమెనిటీస్ సెక్రెటరీలతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ సిద్దారాంపురం, కొడిమి, ఆలమూరు లేఅవుట్లలో రూఫ్ లెవెల్‌కు వచ్చిన ఇళ్లను పూర్తి చేయించాలన్నారు. కాంట్రాక్టర్లు, కూలీలు, లబ్ధిదారులతో ప్రతి రోజూ సమీక్ష చేసుకోవాలన్నారు. పట్టణంలో ఇళ్ల నిర్మాణాల వేగం పెంచేందుకు మరింత మంది అమెనిటీస్ సెక్రెటరీలకు బాధ్యతలు అప్పగించాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి టార్గెట్‌ను చేరుకోవాలని ఆదేశించారు. లే అవుట్ల వారిగా ఇళ్ల నిర్మాణాల పురోగతిని ఈసందర్భంగా సమీక్షించారు. ప్రతి రోజు పనుల పురోగతిపై సమీక్షించుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆస్సెట్ సీఈవో కేశవనాయుడు, ఆర్డీవో మధుసూదన్, మునిసిపల్ కమిషనర్ రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మరో 'చలో విజయవాడ' ఆలోచన రానీయొద్దు

## ప్రభుత్వం స్పందించపోతే ఐక్య ఉద్యమాలకు శ్రీకారం
## ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మరో చలో విజయవాడ ఉద్యమం చేయాలనే ఆలోచన తలెత్తక ముందే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఆదివారం అనంతపురం జిల్లా కేంద్రంలోని కృష్ణ కళామందిరం గల రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు చట్ట బద్ధంగా రావాల్సిన కోట్లాది రూపాయలు చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు సిపిఎస్ రద్దు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ వంటివి ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. తెలంగాణా రాష్ట్రంలో కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేశారని, ఉమ్మడి రాష్ట్రంలో నియమితులైన రాష్ట్ర కాంట్రాక్ట్ ఉద్యోగులను ఎప్పుడు రెగ్యులరైజేషన్ చేస్తారో, అసలు చేస్తారో లేదో అన్న ఆందోళన నెలకొందన్నారు. కేంద్రం చేసిన 4 చట్టాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేని దుస్థితి నెలకొందన్నారు. ఉద్యోగుల సమస్యలపై ఎపి జెఎసి అమరావతి ఆధ్వర్యంలో 66 రోజులుగా శాంతియుతంగా ఉద్యమాలు చేపట్టామని తెలిపారు. అయినా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఈ నెల 12 నుంచి 19వ తేదీ వరకు రాష్ట్రంలోని 175 మంది ఎమ్మెల్యేలు, 23 మంది ఎంపీలకు ఉద్యోగుల ఆవేదనను చెబుదాం అనే కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యేలు, ఎంపీలను ఏపి జేఏసి అమరావతి నాయకత్వం కలిసి విన్నవించనుందన్నారు. ఉద్యోగులు వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వానికి సహకరించినట్లుగా ఏ ప్రభుత్వానికి సహకరించలేదన్నారు. ప్రభుత్వం మాత్రం ఉద్యోగులను విస్మరిస్తోందన్నారు. వేతనంలో భాగమైన డిఎలు, ఒప్పందం ప్రకారం పిఆర్‌సి, అరియర్స్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వకపోగా ఎప్పుడు ఒకప్పుడు వేతనాలు ఇస్తున్నాం అన్న పద్ధతుల్లో ప్రజా ప్రతినిధులు మాట్లాడటం సరికాదన్నారు. 13 లక్షల మంది ఉద్యోగులు ప్రజల్లో భాగస్వామ్యంగా ఉన్న తమను ప్రభుత్వం మరిచిపోయినట్లు ఉందన్నారు. వృద్ధాప్యంలో ఉన్న పెన్షనర్లకు కూడా సకాలంలో పెన్షన్ ఇవ్వని దుస్థితి నెలకొందన్నారు. ఏ ఒక్క అంశంపై కూడా ప్రభుత్వం నుంచి స్పష్టత లేదన్నారు. జూలై 1 నుంచి 12వ పిఆర్‌సి మొదలవనుందన్నారు. ప్రభుత్వం తక్షణమే 12వ పిఆర్‌సి పే కమిషన్‌ను నియమించాలన్నారు. ఉద్యోగుల సమస్యలపై ఈ నెల 9న శ్రీకాకుళంలో మొదటి ప్రాంతీయ సదస్సు నిర్వహించామన్నారు. ఈ నెల 17న అనంతపురం జిల్లాలో రెండవ ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. 27న ఏలూరులో, జూన్ 8న గుంటూరులో ప్రాంతీయ సదస్సు నిర్వహించి జూన్ 30న ఒక్క రోజు నిరాహార దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. అప్పటి లోగా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమకు రావాల్సిన బకాయి డబ్బులు చెల్లించి, సమస్యలు పరిష్కరిస్తే సంతోషిస్తామన్నారు. అలా కాదని మొండిగా వ్యవహరించి అణచివేయాలని చూస్తే మరో చలో విజయవాడ తరహా ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఉద్యమ నాయకత్వంపై రాజకీయ పార్టీలు బురదజల్లే కార్యక్రమాలు చేశాయని విమర్శించారు. ఉద్యోగ సంఘాల ఏజెసిలు ఏకతాటిపై వచ్చి సమస్యల పరిష్కారానికి పోరాడనున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో ఎపి జెఎసి అమరావతి జిల్లా చైర్మన్ ఆర్ఎన్.దివాకరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పిఎస్.ఖాన్, ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కుల్లాయప్ప, క్లాస్ ఫోర్త్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మల్లేశ్వర్‌రావు, విఆర్ఒ సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ సాంబశివరావు, సుబ్రమణ్యం, క్లాస్ ఫోర్త్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ తోట చెన్నప్ప, విఆర్ఎ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శి సీతారాముడు, హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ నాయకులు జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎపి జెఎసి అమరావతి చైర్మన్, పాల్గొన్న నాయకులు

# పండ్ల తోటల పెంపకంతో లాభాలు

## జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్






**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

పండ్లతోటల పెంపకంతో రైతులు అధిక దిగుబడితో పాటు లాభాలు గడించవచ్చునని శ్రీసత్యసాయి జిల్లా ఉద్యానవనశాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పండ్ల తోటల పెంపకంపై రైతులు గత పది సంవత్సరాల నుండి ఆసక్తి చూపి విరివిగా పండ్ల తోటలు పెంపకాన్ని సాగించారు. గతంలో తీవ్ర వర్షాభావంతో పండ్ల తోటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. నాలుగు సంవత్సరాల నుండి జిల్లాలో వర్షాలు కురుస్తుందన రైతులు పండ్ల తోటల పెంపకం చేపడుతున్నారు దానికి తోడు ప్రభుత్వం కూడా ఎన్నో ప్రోత్సాహకాలు కల్పిస్తోంది. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీ సత్య సాయి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్ కోరారు. ఈమేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

**ప్రశ్న: పండ్ల తోటలసాగుతో రైతులకు ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయి.?**

**జవాబు:** అతివృష్టి, అనావృష్టి చేత ఇటీవల చాలామంది రైతులు పంటలు సాగు చేయలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో పండ్లతోటల పెంపకంపై ఎక్కువ మంది రైతులు మక్కువ చూపుతున్నారు. రైతులకు ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలు ఇస్తూ పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలు సాగు చేసుకోవచ్చు. దీని ద్వారా రైతులకు పెట్టుబడి తగ్గుతుంది. వీటి సంరక్షణకు కూడా ప్రభుత్వం చేయూతనందిస్తోంది. మొదటి దశలో గుంతలు తీయడానికి మొక్కలు నాటడానికి మూడు సంవత్సరాల సంరక్షణకు కోసం రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా బిల్లులు మంజూరు చేస్తున్నాము. దీంతో ఎక్కువ శాతం మంది రైతులు పండ్ల తోటల పెంపకంపై మక్కువ చూపుతున్నారు.

**ప్ర : పండ్లతోటల పెంపకం కోసం రైతులకు ప్రభుత్వం ఎలాంటి ప్రోత్సాహకాలు కల్పిస్తోంది.?**

**జ:** పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహాలను అందిస్తోంది. బోరు బావులు త్రవ్వకం, రైతులకు డ్రైలాండ్ హార్టికల్చర్ పథకం ద్వారా మామిడి మొక్కలు సాగు చేస్తే మొక్కలకు నీటిని అందించడానికి ఎరువులు, తదితర వాటి కోసం మూడేళ్ల పాటు ఎకరాకు రూ.1,3,193 రాయితీ అందిస్తుంది. బోరు బావులు ఉన్న రైతులకు చీనీ మొక్కలు సాగు చేసుకుంటే రూ.1, 07, 459ల రాయితీ అందిస్తోంది. జామ, సపోటా, కొబ్బరి, సీతాఫలం, తదితర పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం విరివిగా రాయితీలు అందిస్తోంది. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

**ప్ర: పండ్ల తోటల రైతులకు ఏయే పంటలకు ఎంత నష్టపరిహారం అందిస్తారు?**

**జ:** సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 2022 సంవత్సరంలో కురిసిన వర్షాలకు 255 హెక్టార్లలో పండ్లతోటలకు నష్టం వాటిల్లింది. 316 మంది రైతులు నష్టపోయారు. అత్యధికంగా కాయగూరలు పంటలైన టమోటాకు భారీ నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా 110 ఎకరాల్లో టమోటా పంట నాశనమైంది. నష్టపరిహారం బొప్పాయికి ఎకరాకు రూ. 15వేలు, అరటికి రూ.25 వేలు మామిడికి ఎకరాకు రూ.20 వేలు, నారింజ, దానిమ్మ, చీనా, కాయగూరలు పంటలకు రూ.15వేలు, కొత్తిమీర పంటకు రూ.7200లు నష్టపరిహారం అందిస్తున్నాం.

**ప్ర : పండ్ల తోటల రైతులకు నష్ట నివారణ చర్యలేవి?**

**జ:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సత్యసాయి జిల్లాలో ఉద్యానవన పంటలకు అపార నష్టం వాటిల్లింది. ఉద్యాన పంటలతో పాటు కాయగూరలు, పండ్ల తోటలు పెంచిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రాథమిక అంచనా ప్రకారం పంట నష్ట నివేదికను తయారుచేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం. జిల్లాలో 33శాతం పంట నష్ట పరిహారం అందించడానికి ప్రతిపాదనలు పంపాం. గత సంవత్సరంలో కురిసిన భారీ వర్షాలకు పంట నష్ట పరిహారం అంచనా వేసి నివేదికలు ప్రభుత్వానికి పంపాము. వాటికి పంట నష్టపరిహారం కూడా అందజేశాం.

**ప్ర : గత నాలుగు సంవత్సరాల నుండి నష్టపోయిన రైతులను ఏ విధంగా ఆదుకుంటున్నారు?**

**జ:** పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికలు ప్రతి సంవత్సరం ప్రభుత్వానికి అందిస్తున్నాం గత నాలుగు సంవత్సరాల నుండి ఉద్యానవన పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాం. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి ఇచ్చిన నివేదికలు ప్రతి సంవత్సరం అందజేస్తున్నాం. దాని ప్రకారం ఇంకా రావాల్సిన వారికి త్వరలో నష్టపరిహారం అందజేయనున్నాం. వీటికి తోడు డ్రిప్పు పరికరాలు, స్ప్రింక్లర్లు, స్ప్రేయర్లు,పైపులు సబ్సిడీ ధరలకు అందిస్తున్నాం.

# మాజీ బాస్‌లున్నా... పోలీసు వ్యవస్థ అస్తవ్యస్తం



## ఇక్కడ కేసుల నమోదు ఉండదు...గస్తీ ఉండదు...
## హిందూపురంలో అచేతనంగా మారిన పోలీస్ వ్యవస్థ

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురానికి ఏకంగా ఇద్దరు మాజీ పోలీస్‌బాస్‌లు ప్రాతినిత్యం వహిస్తున్నారు. ఒక్కరేమో ఏకంగా రాయలసీమ ఐజిగా పని చేసి, పదవి విరమణ చేసి, ఇక్కడి నుంచే రాజకీయ అరంగేట్రం చేశారు. మహ్మద్ ఇక్బాల్ గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓడిపోయినప్పటికి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎమ్మెల్సీని చేయడంతో పాటు హిందూపురం నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జిగా నియమించారు. ఆయన కనుసన్నల్లోనే హిందూపురంలో పాలన సాగుతోంది. మరొకరు హిందూపురం పార్లమెంట్ సభ్యులు గోరంట్ల మాధవ్. ఆయన యంగ్ డైనమిక్ పోలీస్ ఎస్ఐ, సిఐగా రాణించారు. అక్రమార్కులపై ఉక్కు పాదం మోపుతారని పేదలకు న్యాయం చేస్తారని ఇద్దరికి డిపార్టుమెంట్‌లోనూ, సమాజంలోనూ పేరుంది. వారికి ఉన్న ఆ పేరే ఎమ్మెల్సీ, ఎంపీ పదవులు వచ్చేలా చేసిందని చెప్పవచ్చు. ఇలాంటి వారు ప్రాతి నిత్యం వహించే నియోజక వర్గంలో పోలీస్ వ్యవస్థ సమున్నతంగా పని చేస్తుందని ప్రజలు ఆశించారు. అయితే ఇందుకు విరుద్ధంగా నాలుగు సంవత్సరాలుగా పోలీస్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పోలీస్ వ్యవస్థతో ప్రజలకు ఒరింగింది లేదు. దీనికి తోడు ఇక్కడి పోలీసులు నాయకుల కనుసన్నల్లో పని చేస్తు కనీసం కేసులు నమోదు చేయడం లేదన్న విమర్శలున్నాయి. స్టేషన్ మెట్లు ఎక్కిన సామాన్యులకు న్యాయం చేసింది లేదని. పట్టపగలే చోరీలు, నిత్యం బెట్టింగ్‌లు, పేకాట, మట్కా, ఇసుక అక్రమ రవాణ యధేచ్ఛగా సాగుతున్నా ప్రేక్షక పాత్ర వహిస్తున్నారే తప్ప చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఒకరో ఇద్దరో ఇక్కడి వచ్చిన పోలీస్ అధికారులు నిజయితీగా పనిచేయడానికి ప్రయత్నం చేస్తే, తమను లెక్క చేయడం లేదంటు నాయకులు ఫిర్యాదు చేసి, వారిని బదలీ చేయించాలని ఒత్తిడి తెస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో బదిలీ వేటు పడుతోంది. దీంతో ఇక్కడ పోలీస్ వ్యవస్థ నిస్తేజంగా మారిందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు అధికారులు, కింది స్థాయి పోలీసులు సెటిల్‌మెంట్లు చేసుకుంటు పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినపిస్తున్నాయి.

పట్టణంలో ఇటీవల కాలంలో ఆకతాయిల ఆగడాలు పెరిగిపోయాయి. పట్టపగలే చోరీలకు పాల్పడుతున్నా, మహిళల మెడలో బంగారు గొలుసులు లాక్కెళ్తున్నా పోలీసులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కర్నాటక నుంచి నిత్యం పదుల సంఖ్యలో వాహనాల్లో మద్యం తరలివస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడన్న విమర్శలున్నాయి. రాత్రి 8 గంటలు దాటితే శివారు ప్రాంతాల్లోని కొన్ని గృహాల్లో వ్యభిచారాలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు బలంగా వినపిస్తున్నాయి. ఇక పోతే పట్టణంలో పట్టపగలే చోరీలు జరుగుతున్నాయి. ఇటీవల ఆర్టీసీ బస్టాండు వద్ద ఒక వ్యక్తి స్కూటీలో నగదు పెట్టి టీతాగి వచ్చేలోపు నగదు మాయం అయింది. టీచర్సు కాలనీలో ఇటీవల పట్టపగలే మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లాడానికి దొంగ





ప్రయత్నం చేస్తే, స్థానికులు పట్టుకుని దేహ శుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అయితే బాధితులు ఫిర్యాదు చేయడానికి వెనుకడుగు వేశారు. లేపాక్షి వైపు నుంచి ఇటీవల ద్విచక్ర వాహనంలో దంపతులు వస్తుండగా కొంతమంది యువకులు తప్ప తాగి అసభ్యంగా ప్రవర్తించారు. ద్విచక్రవాహనాలు పార్క్ చేస్తే ఎత్తుకెళ్తున్నారు. 20 రోజుల క్రితం పరిగి బస్టాండులో మడకశిర ప్రాంతానికి చెందిన ఓ రైతు మార్కెట్‌కు వచ్చి చింతపండు విక్రయించి బస్టాండులో ఉండగా జేబు కత్తిరించి రూ.40వేలు ఎత్తుకెళ్లారు. బెంగళూరు రోడ్డులో 25 రోజుల క్రితం రాత్రి 11గంటల ప్రాంతంలో ఓ రైతు చింతపండు వేసుకొస్తుండగా ఆటోను ఆపి డ్రైవరును, రైతులను బెదిరించి రెండు క్వింటాళ్ల చింతపండును ఎత్తుకెళ్లారు. అయితే వీరు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. దీంతో పాటు హిందూపురం ముస్లీం శ్మశాన వాటికలో ఒకరు తనదే సామ్రాజ్యం అనే విధంగా ప్రవరిస్తున్నాడు. సాంప్రదాయాలను పాటించకుండా అడ్డుకుంటున్నారు. ఇతనిపై ఫిర్యాదులు చేసిన ఎవరు పట్టించుకోవడం లేదు. ఫిర్యాదులు సైతం తీసుకోవడం లేదు. నాలుగు రోజుల క్రితం ఓ యువతి తనను పట్టణంలో ఓ యువకుడు ప్రేమించి మోసం చేశాడని, తనకు న్యాయం చేయాలని స్టేషన్‌కు వెళ్లితే ఆ బాధితురాలి ఫిర్యాదు తీసుకోలేదు, కేసును నమోదు చేయలేదు. ఈ నేపథ్యంలో ప్రశాంతమైన హిందూపురంలో ప్రజాజీవనం ప్రశ్నార్థకంగా మారుతోంది. కనీసం రాత్రి సమయంలో గస్తీ సైతం తిరగడం లేదు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే సిబ్బంది కొరత అంటున్నారు. ప్రజలకు సేవ చేయాలని, నిజాయితీగా ఒకరిద్దరు అధికారులు పని చేస్తే వారిపై బదలీ వేటు తప్పడం లేదు. దీంతో తమకెందుకు అనేలా పోలీస్ అధికారులు వ్యవహరించడంతో పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలు పెట్రేగిపోతున్నాయి. ఇప్పటికైన పోలీస్ ఉన్నతాధికారులు హిందూపురంపై ప్రత్యేక దృష్టి సారించి, పోలీస్ వ్యవస్థను గాడిలో పెట్టక పోతే ప్రజలకు రక్షణ ఉండదన్న అభిప్రాయాలు పట్టణవాసుల్లో వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తి
www.prajasakti.com



## అసాంఘిక శక్తులపై చర్యలు : ఎస్ఐ బాలకృష్ణయ్య

ప్రజాశక్తి-శింగనమల


పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ బాలకృష్ణయ్య

మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ బాలకృష్ణయ్య హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్ఐగా బాలకృష్ణయ్య పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలు పోలీస్ సిబ్బందికి సహకరించాలని కోరారు. మండల వ్యాప్తంగా ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా తమకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. అలాగే గుట్కా, మట్కా, బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం నూతన ఎస్ఐకి ఎఎస్ఐ వలి, సిబ్బంది ఖాదర్‌బాషా, సాయి, ధనుంజయ, ఇక్బాల్‌బాషా, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## వివాహానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న దండు శ్రీనివాసులు

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని కల్లుమడి గ్రామానికి చెందిన రామాంజినమ్మ, ఓబులేసు కుమార్తె వివాహానికి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆదివారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల వివాహాలకు ఆర్థికసాయం అందించడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కల్లుమడి గ్రామ కమిటీ అధ్యక్షులు సుధాకర్‌నాయుడు, మల్లేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన మిద్దె కుళ్లాయప్ప

ప్రజాశక్తి-నార్పల


మంత్రిలో మాట్లాడుతున్న మిద్దె కుళ్లాయప్ప

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప, నాయకులు వెంకట్రాముడు ఆదివారం అనంతపురంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించారు. 2024లో శింగనమల నియోజకవర్గంలో వైసిపి విజయం సాధించే విధంగా కృషి చేయాలని మంత్రి సూచించినట్లు తెలిపారు.

## నేటి నుంచి మూడోవిడత ప్రజాసంక్షేమ పాదయాత్ర

ప్రజాశక్తి-తాడిపత్రి

ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన మూడో విడత ప్రజాసంక్షేమ పాదయాత్రం సోమవారం నుంచి తిరిగి ప్రారంభం కానున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిపత్రి రూరల్ మండలం వెంకటరెడ్డిపల్లి నుంచి ఉదయం 7 గంటలకు పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. తాడిపత్రి రూరల్ మండలంలో దాదాపు 12 రోజులపాటు 130 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ముగింపు రోజు గన్నేవారిపల్లి కాలనీలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే చేపట్టనున్న పాదయాత్రలో ప్రజలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## దుర్గం సర్పంచికు పరామర్శ

ప్రజాశక్తి-నార్పల


సిద్ధరాచెర్ల పంచాయతీ సర్పంచి రామాంజనేయులును పరామర్శిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న నార్పల మండలం దుర్గం గ్రామానికి చెందిన సిద్ధరాచెర్ల పంచాయతీ సర్పంచు రామాంజనేయులును ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబ శివారెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇందులో భాగంగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తర్వాత గొడవకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన వారిపై చట్టం రీత్యా చర్యలు తీసుకునేలా పోలీసులను ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నాగేశ్వరరావు, బండ్లపల్లి ఎంపిటిసి శంకర్‌యాదవ్, గంగనపల్లి సర్పంచు కుళ్లాయిరెడ్డి, వైసిపి నాయకులు వెంకటనారాయణరెడ్డి, ఎంపిటిసి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దాసుపత్రిలో అన్నదానం


అన్నదానం చేస్తున్న ఆలమూరు నరసమ్మ కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం

ఆలమూరు నరసమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని పెద్దాసుపత్రి వద్ద ఆలమూరు కుటుంబ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైసిపి సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి మాట్లాడుతూ అన్నదానం చేయడం మహా గొప్ప కార్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలమూరు కుటుంబ సభ్యులు, మాజీ ఎంపిపి శ్రీనివాసరెడ్డి, వెంకటశివారెడ్డి, భవిష్యరెడ్డి, రాఘవేంద్రారెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి గౌస్‌బేగ్, నాయకులు నాయకులు గోపాల్‌మోహన్,పెన్నోబిలేసు, కృష్టం రఘు, దిలీప్‌రెడ్డి, సురేష్, సాయి ట్రస్టు ప్రతినిధి విజయ్‌సాయి, రిటైర్డ్ ఐఎఎస్ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## విఆర్‌ఒలు లేక ప్రజల ఇబ్బందులు

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో విఆర్‌ఒలు అందుబాటులో ఉండకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కేంగురి ఎర్రిస్వామి ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. అలాంటి సదుద్దేశానికి మండల విఆర్‌ఒలు తూట్లు పొడుస్తున్నారన్నారు. చాలామంది విఆర్‌ఒలు సచివాలయాలకు రాకుండా మండల కేంద్రంలో ఉంటూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీఆర్వోలు ఆయా సచివాలయాలకు విధిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# జెసిఎస్ మండల ఇన్‌ఛార్జుల సేవలు అభినందనీయం

### ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు


జెసిఎస్ ఇన్‌ఛార్జిని సన్మానిస్తున్న మంత్రి పెద్దరెడ్డి, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం అమలులో రాష్ట్రంలోనే అనంతపురం జిల్లా మొదటిస్థానంలో నిలిసేందుకు కృషి చేసిన వైసిపి జెసిఎస్ మండల ఇన్‌ఛార్జిల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కొనియాడారు. ఈమేరకు ప్రతిభ కనబరిచిన జెసిఎస్ ఇన్‌ఛార్జిలను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అతితక్కువ కాలంలోనే ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం సంతోషకరమన్నారు. సిఎం జగన్ తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా నేరుగా ప్రజల వద్దకే పరిపాలన చేరిందన్నారు. మన సిఎం అమలు చేస్తున్న పథకాలను ఇతర రాష్ట్రాలు మోడల్‌గా తీసుకుని మేనిఫెస్టోలో పెడుతున్నాయన్నారు. టిడిపి హయాంలో దుబారాలు, దోపిడీల వల్ల రూ.2.50 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్ర ఖజానాను లూటీ చేశారని కాగ్ నివేదిక ఇచ్చిందన్నారు. కావున చంద్రబాబు మోసాలు, సిఎం జగన్ పేదల కోసం చేస్తున్న మంచిని జేసీఎస్ ఇన్‌ఛార్జిలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఆత్మారామిరెడ్డి మంత్రి పెద్దిరెడ్డిని కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాప్తాడు నియోజకవర్గ పరిశీలకులు బుల్లెట్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి-అనంతపురం


మంత్రి పెద్దిరెడ్డికి వినతపత్రం సమర్పిస్తున్న రాయలసీమ విమోచన సమితి అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి

అసెంబ్లీలో ఆమోదించిన రాజధాని బిల్లు ప్రకారం రాయలసీమలో వెంటనే హైకోర్టు ఏర్పాలు చేయాలని రాయలసీమ విమోచన సమితి అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి కోరారు. ఈమేరకు జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిరెడ్డిని జిల్లాకేంద్రంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు వెంటనే కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డును రాయలసీమలో ఏర్పాటు చేయలన్నారు. ఇకపోతే జిల్లాకు కేటాయించిన ఎయిమ్స్ ఆసుపత్రిని మంగళగిరికి తరలించారని, తిరిగి అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అలాగే కొత్త ప్రాజెక్టులు కట్టి రాయలసీమకు 400 టీఎంసీల నికరజలాలు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విమోచన సమితి నాయకులు మురళీకృష్ణ, జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పట్టపు దేవర

**ఉరవకొండ :** మండలంలోని రాకెట్ల గ్రామంలో రాకెట్ల స్వామి మహా సామ్రాజ్య పట్టపు దేవరను ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా చాబాల ఆలుమత గురువు రేవణసిద్దేశ్వర స్వామి ఆధ్వర్యంలో గంగపూజ, దేవత గ్రామోత్సవం, దేవత నల్లకంబడి పూజ, యల్లమ్మ పూజ, పట్టపు దేవర వంటి కార్యక్రమాలను అత్యంత నిర్వహించారు. అలాగే పెద్ద రాకెట్లప్ప స్వామి, చిన్న రాకెట్లప్ప స్వామి, కౌకుంట్ల సిద్దేశ్వరస్వామి, ఆవుల వశికేరప్పస్వామి, చాబాల రేవన సిద్దేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెంచాల అక్షింతల గోత్రం వారు, విశ్రాంతి కస్టమ్స్ ఆఫీసర్ పచ్చి వెంకటస్వామి, ఆలయ పూజారులు ధనరాజు, చంద్రశేఖర్, కుల పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు పాదయాత్రకు తరలిరండి

**పుట్లూరు :** నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 100 రోజులు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో సోమవారం నియోజకవర్గంలో నిర్వహించనున్న సంఘీభావ పాదయాత్రకు భారీఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని టిడిపి మండల కన్వీనర్ బాలరంగయ్య ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ద్విసభ్య కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని నార్పల మండలం బి.పప్పూరు నుంచి పాదయాత్ర ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

## బిజెపి నాయకుడు అరెస్టు

**పుట్టపర్తి :** జిల్లా బిజెపి అధికార ప్రతినిధి జ్యోతిప్రసాద్‌ను పట్టణ పోలీసులు ఆదివారం కోర్టు వారెంట్‌తో అరెస్టు చేశారు. జ్యోతిప్రసాద్ 2022 ఏప్రిల్‌లో అపార్ట్‌మెంట్ విషయమై శ్రీధర్ కొడుకు వంశీకష్ణపై దాడి చేశాడని, అప్పటి నుంచి ఆయన కోర్టుకు హాజరుకాకపోవడంతో కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేయడంతో ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి జ్యోతిప్రసాద్‌ను రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో బిజెపి నాయకులు కత్తి రాజారెడ్డి, కొండమ రాజు, హరికష్ణగౌడ్, బాలగంగాధర్, తదితరులు పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. ఎమ్మెల్యే కక్ష సాధింపులో భాగంగానే అరెస్టు చేయించారని వారు ఆరోపించారు.


నిత్యావసర సరుకుల బ్యాగులను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## నేడు ఉచిత ఖత్నా

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని అంజుమన్ అజ్మతుల్ ఇస్లాం తరపున పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఉన్న జామియా అన్వారుల్ ఉలూమ్‌లో సోమవారం ఉచిత ఖత్నా (వడుగుల) కార్యక్రమం నిర్వహించనున్నట్లు అంజుమన్ కమిటీ అధ్యక్షుడు బ్రెడ్ షర్మస్ తెలిపారు. ఈమేరకు ఆదివారం ఇందుకు సంబంధించి పంపిణీ చేసే నిత్యావసర సరుకుల బ్యాగును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 160 పిల్లల పేర్లు నమూదైనట్లు తెలిపారు. వారందరికీ ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేశామన్నారు. వచ్చేవారికోసం టిఫిన్, భోజనం ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఖత్నా చేయించుకునే పిల్లలకు పది రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంజుమాన్ కమిటీ అధ్యక్షుడు బ్రెడ్ షర్మస్ ఉపాధ్యక్షుడు బాషా, కార్యదర్శి మొహమ్మద్ షఫీ, సహాయ కార్యదర్శి హుజేఫా, కోశాధికారి అహ్మద్‌హుస్సేన్, కమిటీ సభ్యులు బాషా, ఖాసీం, ఉమ్రలీ, రజాక్, షేక్ జాకీర్, షాకీర్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

# తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్

### మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతికగా మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు నిలిచారని టిడిపి రాష్ట్ర నాయకులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం టిడిపి వ్యవస్థాపకులు ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను టిడిపి అనంతపురం పార్లమెంట్ అధ్యక్షులు కాలువ శ్రీనివాసులు అధ్యక్షతన నగరంలోని కమ్మభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ ఏర్పాటు చేసిన టిడిపి 9 నెలల కాలంలోనే అధికారం చేపట్టి బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచారని తెలిపారు. సంపూర్ణ మధ్యపానం నిషేదంపై సంతకం పెట్టిన మహానేత ఎన్టీఆర్ అన్నారు. రంగులు వేసుకునే వారికి ఎందుకు రాజకీయాలు అని నాటి కాంగ్రెస్ నేతలు విమర్శించినా పట్టు విడువకుండా ప్రజల హృదయాలను గెలిచి ప్రభుత్వాన్ని నడిపారన్నారు. మహిళలకు ఆస్తిలో హక్కు కల్పించారన్నారు. దేశంలో రెండు నదులను అనుసంధానం చేసిన మహావ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. తెలుగువారి ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు అన్నారు. టిడిపికి అనంతపురం జిల్లా కంచు కోట అన్నారు. రానున్న ఎన్నికల్లో భారీ మెజారిటితో గెలువబోతున్నామని, టిడిపి ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవడానికి ప్రజలు సిద్ధమయ్యారన్నారు. ప్రతి కార్యకర్త జాగ్రత్తగా పని చేసి టిడిపి జెండాను ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, మాజీఎమ్మెల్యేలు వైకుంఠం ప్రభాకర్ చౌదరి, ఈరన్న, ఉన్నం హనుమంతరాయచౌదరి, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమా మహేశ్వరనాయుడు, శింగనమల ఇన్‌చార్జి బండారు శ్రావణిశ్రీ, రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణ, మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గౌస్‌మొద్దీన్, మాజీ మేయర్ స్వరూప, టిడిపి శింగనమల ద్విసభ్య కమిటి సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, టిడిపి మహిళా రాష్ట్ర నాయకులు విశాలాక్షి, స్వప్న, తేజస్విణి, నగర అధ్యక్షులు మారుతికుమార్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, తెలుగు యువత నాయకులు లింగారెడ్డి, సుధాకర్ యాదవ్, కూచిహరి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై ఆగిపోతున్న ఆర్టీసీ బస్సులు..

### ఇబ్బందుల్లో ప్రయాణికులు

ప్రజాశక్తి-రొద్దం

పెనుగొండ-పావగడ మార్గంలో ఆర్టీసీ బస్సు ఎక్కాలంటే ప్రయాణికులు ఆలోచించా ల్సిన పరిస్థితి నెలకొంది. పెనుగొండ డిపోకు చెందిన దాదాపు పది ఆర్టీసీ బస్సులను పెనుగొండ నుంచి పావగడకు నడుపుతున్నారు. అయితే 15 రోజుల నుంచి బస్సులు వివిధ సమస్యలతో ఎక్కడబడితే అక్కడ ఆగిపోతున్నాయి. ఈ క్రమంలోనే ఆదివారం పెనుగొండ వైపు నుంచి పావుగడ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆంధ్ర దాటిన వెంటనే కర్నాటకలోని కొడమడుగు గ్రామంలో వెనకవైపు చక్రాల బేరింగులు పాడవడంతో 11 గంటల సమయంలో ఉన్నఫళంగా నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు దాదాపు గంటసేపు ఎండలోనే తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆ తర్వాత మరో బస్సు రాగా అందులో వెళ్లారు. దీంతో ప్రయాణికులు ఆర్టీసీ బస్సు ఎక్కాలంటే ఆలోచించాల్సి వస్తోంది. ఇకనైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ఈ మార్గంలో కండీషన్‌లో ఉన్న బస్సులను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.


పెనుగొండ-పావగడ మార్గంలో ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

# రెజ్లర్లపై లైంగిక వేధింపులు దుర్మార్గం

### బిజెపి ఎంపీ దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి-లేపాక్షి

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడడం దుర్మార్గమని ఎన్ఐఎఫ్‌డబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మావతి, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయప్ప పేర్కొన్నారు. మహిళా యోధులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి, రెజ్లింగ్ ఫెడరేషన్ ఛైర్మన్ బ్రిజ్‌భూషణ్ చరణ్ సింగ్ దిష్టిబొమ్మను ఆదివారం లేపాక్షి ప్రధాన రహదారిపై మహిళా సంఘాల సభ్యులతో ఊరేగించి దహనం చేశారు. ఈ సందర్భంగా వారు 'మహిళా ఐక్యత వర్ధిల్లాలి.. మోదీ డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతదేశ కీర్తి ప్రపంచ వ్యాప్తంగా విస్తరించేలా మహిళా క్రీడాకారిణులు ఒలంపిక్స్, కామన్‌వెల్త్ పోటీల్లో పతకాలు సాధించగా వారిని అభినందించాల్సింది పోయి లైంగిక వేధింపులకు పాల్పడ డం దుర్మార్గమన్నారు. అలాంటి వారిపై ప్రధాని మోడీకి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోకపో వడం దారుణమన్నారు. వారి కుటుంబాలపై దాడులు, దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడడం శోచనీయమన్నారు. ఈ విషయంపై దేశవ్యాప్తంగా క్రీడాకారులు, రైతు, మహిళా సంఘాలు ఆందోళనలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని మండిపడ్డారు. బిజెపి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో రాజేంద్ర, ఎన్ఎఫ్ఐడబ్ల్యు మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ జయలక్ష్మి, లక్ష్మి, ఆదిలక్ష్మి, సంపూర్ణమ్మ, ఏఐవై ఎఫ్ జిల్లా ఆర్గనైజేషన్ కార్యదర్శి నరసింహా, వెంకటేష్ సిపిఐ నాయకులు పాల్గొన్నారు.


బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం


పూజలందుకున్న ఆందజేస్తున్న ఆంజనేయస్వామి

# ఘనంగా హనుమజ్జయంతి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఆదివారం మండలంలో ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారికి పన్నీటి స్నానాలు ఆచరించి వేదమంత్రాలతో వెండి కవచం, సువర్ణ కిరీటం ధరించి తమలపాకుల పూజ చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో చిన్న రథోత్సవం నిర్వహించినట్లు ఆలయ సిబ్బంది ఓబన్న తెలిపారు. అలాగే మండలంలోని లింగదహాల్, కృష్ణాపురం, దేవగిరి, శ్రీధరఘట్ట, కురువల్లి గ్రామాల్లో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ఆత్మకూరు :** మండల కేంద్రంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారికి పన్నీటి స్నానాలు ఆచరించి వేదమంత్రాలతో వెండి కవచం, సువర్ణ కిరీటం ధరించి తమలపాకుల పూజ చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో చిన్న రథంపై స్వామివారి మూలవిరాట్‌ను ఆసీనులను చేసి ఊరేగించారు. అలాగే మండలవ్యాప్తంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**అనంతపురం :** హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఆదివారం అనంతపురంలోని ద్వారకా విలాస్ సమీపంలో ఉన్న నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా మూలవిరాట్‌కు అభిషేకం, అర్చనలు, అలంకారాలు చేశారు. ఈ సందర్భంగా సాయి ఆదిత్య కనస్ట్రక్షన్ అధినేత పురుషోత్తం మురళీకృష్ణ, నిర్మలామురళి కలిసి ఆంజనేయస్వామి విగ్రహం, పాదుకలు, బలిపీఠం ఏర్పాటుకు రూ.10వేలు అందించారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి శరన్, ప్రభాకర్, నరసింహులు, వెంకటరామిరెడ్డి, రాధ, అనంతమ్మ, ఆనంద్, కల్పన, భక్తులు పాల్గొన్నారు.

**పుట్లూరు :** హనుమజ్జయంతిని పురస్కరించుకుని మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఇందులో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆకుపూజలు నిర్వహించారు. ముఖ్యంగా మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో వడ్డెర యూత్, భక్తుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

**శింగనమల :** మండలవ్యాప్తంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారికి పన్నీటి స్నానాలు ఆచరించి వేదమంత్రాలతో వెండి కవచం సువర్ణ, కిరీటం తమలపాకులు పూజ చేశారు. సాయంత్రం అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. పలుచోట్ల అన్నదానం చేశారు.

**రాయదుర్గం :** పట్టణ పొలిమేరలోని జాతీయ రహదారి చెక్ పోస్ట్ సమీపంలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం, మధ్యాహ్నం గణపతి, నవగ్రహ, ఆంజనేయ మూలమంత్ర హోమాలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం, ఆంజనేయ జెండాల పంపిణీ చేశారు. కాగా సిద్దేశ్వర కాలనీలో ఉన్న బయలు ఆంజనేయ స్వామి ఆలయం, ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న ఉక్కడ ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు.


రాయదుర్గంలో పూజలు చేస్తున్న భక్తులు

**నార్పల :** మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమజ్జయందిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పన్నీటి స్నానాలు ఆచరించి వేదమంత్రాలతో వెండి కవచం, సువర్ణ కిరీటధారణ, తమలపాకులు పూజ చేశారు. తర్వాత స్వామివారిని అలంకరించి సాయంత్రం పురవీధుల్లో ఊరేగించారు.

## నేరాలు ఘోరాలు

## ఈతకెళ్లి యువకుడు మృతి

**యాడికి :** ఈతకు వెళ్లి యువకుడు మృత్యువాత పడిన ఘటన మండలంలోని తిప్పారెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన శేఖర్‌యాదవ్ కుమారుడు మంజునాథ, గోపాల్ కొడుకు శ్రీకాంత్, లారీ డ్రైవర్ హాజీవలీ కుమారుడు హాజీ బాబా (17) కలిసి ఆదివారం మధ్యాహ్నం గ్రామానికి సమీపంలో ఉన్న పెద్దవంకలో లోతైన గుంతలో ఈతకు వెళ్లారు. ముగ్గురూ సుమారు గంటపాటు ఈత కొట్టారు. ఇంటికి వస్తున్న సమయంలో దుస్తులు వేసుకుంటుండగా హాజీ బాబా కాలు జారి నీటిగుంటలో పడ్డాడు. నీటిలో మునిగిన బాబా ఎంతకూ బయటికి రాకపోవడంతో భయపడిన మంజునాథ, శ్రీకాంత్ ఇంటికొచ్చి తల్లిదండ్రులతో చెప్పారు. స్థానికులు వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ గురునాథ్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ట్రాక్టర్‌ను ఢీ కొన్న లారీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

**కనగానపల్లి:** మండల పరిధిలోని దాదులూరు వద్ద జాతీయ రహదారిపై ట్రాక్టర్‌ను లారీ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. రామగిరి మండలంలోని కుంటిమద్ది గ్రామానికి చెందిన చంద్ర ఆదివారం దాదులూరు వద్ద తన ట్రాక్టర్‌తో రోడ్డు మధ్య ఉన్న చెట్లకు నీరు పడుతుండగా హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న లారీ వెనుక వైపు ఢీ కొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ బోల్తా పడడంతో చంద్రతో పాటు లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికుల సహాయంతో అంబులెన్సులో ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.